క్లుప్తంగా

పాత పెన్షన్ వర్తింప చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: 2003లో డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు తలపెట్టిన శాంతియుత ధర్నాకు రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) గుంటూరు జిల్లా శాఖ తరపున మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 20 ఏళ్లగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారం కోసం, పాత పెన్షన్ విధాన సాధన దిశగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నంబర్ 57 అమలుకోసం తలపెట్టిన పోరాటం న్యాయబద్ధమైనదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

నెహ్రూనగర్: పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలను తీసుకుని వాటి అమలుకు చర్యలు తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గం ఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1200 మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాలు మార్పులు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఏఈఆర్‌ఓలు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు, రామకృష్ణ (బీజేపీ), సీహెచ్ వాసు (బీఎస్పీ), బి.సునీల్ కుమార్ (కాంగ్రెస్) టి.సేవా కుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ), సీహెచ్.రామ వెంకట త్రినాద్(జనసేన) పాల్గొన్నారు.

చిరస్మరణీయ నటి బి.సరోజాదేవి



లక్ష్మీపురం: జగదేకనటి, అభినయ సరస్వతి బి.సరోజాదేవి మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషలలో నటించి చిత్ర సీమ పై చెరగని ముద్ర వేశారని రచయిత్రి కవి పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బి.సరోజాదేవి చిత్రపటానికి మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు, సంస్థ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బహు భాషా నటిగా రెండు దశాబ్దాలు ఏడాదికి ఆరేడు సినిమాల్లో నటించిన బి.సరోజాదేవి ఏ భాషలో నటించిన హుందాగా నడుచుకుని ఆయా పాత్రలకు న్యాయం చేశారన్నారు. గాయకులు, రంగస్థల నటులు పి.ఘనశ్యామాచార్యులు మాట్లాడుతూ తెలుగులో అగ్రగణ్య నటుల్లో బి.సరోజాదేవి ఒకరిగా పేరుపొందారన్నారు.

వైభవంగా శ్రీవారికి తిరుప్పావడ సేవ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో బుధవారం శ్రీవారికి అత్యంత వైభవంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. వేదపండితులు మాధవస్వామి బృందం ఆధ్వర్యంలో స్వామి ఉత్సవమూర్తులకు విశేష అర్చనలు, అభిషేకాలు, అలంకరణ జరిగాయి. స్వామి దివ్య దృష్టి పడేలా మహా మండపంలో పెద్ది శ్రీనివాసరావు, శ్రీలత దంపతులు సమర్పించిన మేల్‌చాట్ వస్త్రంపై చిత్రాన్న రాశిలో జిలేబీ, వడ, అప్పాలు, లడ్డూలు, దోసెలను దీర్ఘ చతురస్రాకారంగా 18 అంగుళాల ఎత్తులో ఏర్పాటు చేశారు. అష్టదిక్కులు, ఆరాధనలు జరిపి వివిధ రకాల పూలమాలలతో తిరుప్పావడపై అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో నారాయణం ప్రసాదాచార్యులు వ్యాఖ్యానంతో శ్రీనివాస గద్యాన్ని శ్రవణానందంగా పఠించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయ బాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, సభ్యులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో శివాలయం.. పట్టింపు కరువు!

- ఆలయానికి 61.62 ఎకరాల భూములు
- ఏటా రూ.6.27 లక్షల ఆదాయం
- రూ.30.9 లక్షల మేర బకాయిలు
- అభివృద్ధిని విస్మరించిన దేవదాయ శాఖ

ప్రత్తిపాడు: దిక్కులేనోళ్లకు దేవుడే దిక్కంటారు. అలాంటి దేవ దేవుడు తాను కొలువుదీరిన ఆలయ అభివృద్ధి కోసం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో సుప్రసిద్ధ శ్రీ గంగా పార్వతీ సమేత దండేశ్వరాలయం (శివాలయం)గలదు. గౌతమ మహర్షి, చాణక్య రాజుల కాలంలో నిర్మించిన ఈ దేవాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతోంది. సమస్యలను ఆలకించాల్సిన దేవాదాయ శాఖ ఆలయ అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తుంది. ఫలితంగా చాపకింద నీరులా ఆలయంలో సమస్యలు ఏటా పెరుగుతున్నాయి. ఆలయం ప్రహరీ గోడలు ఎప్పుడు కూలుతాయో.. అవి భక్తులపై ఎప్పుడు పడతాయోనని బయపడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

కూలుతున్న ప్రహరీలు..

ఈ ఆలయం చుట్టూ నాలుగు వైపులా బాగా ఎత్తు గల ప్రహరీ గోడలు ఉన్నాయి. ఎన్నో దశాబ్దాల కిందట కొండ రాళ్లతో నిర్మించిన ఈ ప్రహరీలు ఎప్పుడు ఏ వైపు కూలుతుందో అర్థం కాని పరిస్థితి చోటుచేసుకుటుంది. కొన్నేళ్ల క్రితం ఆలయ ఉత్తరం దిక్కున ఉన్న ప్రహరీ కూలి పక్కనున్న ఇంటిపై పడింది. అనంతరం పడమర దిక్కున ప్రహరీ కూలి ఇంటి పరిసరాల్లో బండ రాళ్లు పడ్డాయి. అనంతరం దక్షిణ దిక్కున ఉన్న ప్రహరీ కూలి రోడ్డుపై పడిపోయింది. తాజాగా రెండు నెలల కిందట తూర్పు వైపున ఉన్న ఆలయ ప్రహరీ అర్ధ రాత్రి కూలిపోయింది. ప్రహరీలు కూలిన ఘటనల్లో ఒక్కసారి మినహా మిగిలిన మూడు సార్లు



కూలిన ప్రహరీ వైపు ప్రమాదకరంగా ఆలయ దుస్థితి

ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు.

రంగులతోనే సరి..

ఆలయానికి 61.62 ఎకరాల భూమి ఉంది. ఏటా రూ.6.27 లక్షల ఆదాయం ఆలయానికి వస్తోంది. అయితే ప్రస్తుతం బకాయిలు కూడా సుమారుగా రూ.30 లక్షల వరకూ ఉన్నాయి. ఇంతటి సుప్రసిద్ధ ఆలయంలో మహా శివరాత్రి, దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. శివరాత్రి సందర్భంలో మాత్రం ఆలయానికి రంగులు వేసి కాస్తంత సుందరంగా ముస్తాబు చేస్తారు. అది కూడా ఏటా కాదు.. రెండు లేదా మూడేళ్లకోసారి మాత్రమే.

దాతల చేయూతతో..

ఆలయాన్ని దేవదాయ శాఖ అధికారులు పూర్తిగా విస్మరించినప్పటికీ గ్రామస్తులు మాత్రం ఆలయ అభివృద్ధికి తమ వంతుగా ఎప్పటికప్పుడు సహకరిస్తూనే ఉన్నారు. ప్రహరీల నిర్మాణం, ఫ్లోరింగ్ ఏర్పాటు, షెడ్లు, స్వామి వారికి కవచాలు.. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల్లో గ్రామస్తుల



శిథిలమైన మెట్లు, నెర్రెలు కొడుతున్న ప్రహరీ

అధ్వానంగా పరిసరాలు..



నవగ్రహ మంటపం వైపు వెళ్లకుండా అడ్డుగా కట్టిన తాళ్లు

భక్తులు ఆలయానికి వచ్చిన సమయంలో వాడుకునేందుకు పూర్వం నిర్మించిన బావి, నవగ్రహ మంటపం, యజ్ఞశాలలు కూడా ప్రస్తుతం పూర్తి శిథిలస్థితిలో ఉన్నాయి. వినియోగంలో లేని బావి అంతా పగుళ్లు తీసి ప్రమాదకరంగా మారింది. ఇటీవల ప్రహరీ కూలిన సమయంలో బావి కూడా సగం పైన కూలిపోయింది. బావికి ఆనుకునే నవగ్రహాల మండపం ఉంది. ఇక్కడ గతంలో నిత్యం భక్తులు పూజలు చేసుకునేవారు. ఇటీవల మంటపం వద్ద 'ప్రవేశం లేదు' బోర్డులు ఏర్పాటు చేయడంతో అటువైపు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాగా యజ్ఞశాలదీ అదే పరిస్థితి.

భాగస్వామ్యమే అత్యధికం. దేవదాయ శాఖ మాత్రం అభివృద్ధి విషయంలో ఎప్పుడూ ప్రేక్షక పాత్రకే పరిమితం అవుతుంది. మహా శివరాత్రి, దేవీ నవరాత్రుల సమయంలోనూ ప్రసాదం, పూలు, లైటింగ్ ఖర్చులకే దేవాదాయ శాఖ పరిమితమవుతుంది. అయితే పై విషయమై ఈవో శివకోటేశ్వరరావును 'సాక్షి' వివరణ కోరగా కూలిన ప్రహరీని నిర్మించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు.

విత్తన దుకాణాల్లో అమ్మకాలు నిలిపివేత



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని విత్తన దుకాణాల్లో గురువారం వ్యవసాయ, విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. స్థానిక మోహన్ ట్రేడర్స్, పయనీర్, మంజునాథ, శ్రీనివాస ట్రేడర్స్‌లో స్క్వాడ్ ఏడీఏ పి.మురళీకృష్ణ, విజిలెన్స్ సీఐ ఎ.వెంకటేశ్వర్లు, డీఏవో కార్యాలయం టెక్నికల్ ఏవో వోఎస్.సునీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణబేగంల బృందం పురుగు మందులు, విత్తన డీలర్ల లైసెన్సులు, ఇన్‌వాయిస్‌లు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. విత్తనాలు ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారన్న విషయాన్ని దుకాణాల యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో రూ.44,250 విలువజేసే విత్తనాలు, రూ.5,27,950 విలువ గల ఫెర్టిలైజర్స్ అమ్మకాలను నిలిపివేసినట్లు ఏవో తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడిగా అక్కిరెడ్డి

పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా చిర్రా అక్కిరెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం నియామకం ప్రకటన విడుదల చేశారు.

సామాజిక మాధ్యమాలపై పట్టు అవసరం

కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ స్థాయిలో విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అవగాహన, పట్టు సాధించటం ద్వారా కళాశాల స్థాయిలో జరుగు తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను బాహ్య ప్రపంచానికి తెలియచేసే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని, తద్వారా కళాశాలతోపాటు విద్యార్థుల ప్రగతికి మేలు కలుగుతుందని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఫిజికల్ సైన్స్ విభాగం, స్టూడెంట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ ఆన్ సోషల్ మీడియా టు ఎన్ హాన్స్ పబ్లిక్ పర్సెప్షన్ ఆఫ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్' అనే అంశంపై జోన్–3 పరిధిలోని 26 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అధ్యక్షత వహించారు. అనంతపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు సోషల్ మీడియా పై



మాట్లాడుతున్న డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా

కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ నిర్వహించారు. బ్లాక్ బక్స్ టీం ఐదు సెషన్స్ ద్వారా సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ ద్వారా సాయిల్ శాంపిల్ కలెక్షన్ అండ్ ఎనాలసిస్ ద్వారా ఇంటర్న్‌షిప్ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్జేడీ డాక్టర్ పి.కళావతి, కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ అధికారి డాక్టర్ తులసి మస్తానమ్మ, ఓఎస్డీ డాక్టర్ ఏవీ కవిత, అనంతపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ, ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ డిప్యూటీ డైరెక్టర్ జయ ప్రదీప్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సీహెచ్ తులసి, బ్లాక్ బక్స్ సీఈఓ టి.అనురాధ, జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.అపర్ణ సీతారాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు జేఎన్‌టీయూకే అనుమతి

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక గ్రామంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు కాకినాడకు చెందిన జేఎన్‌టీయూకే అనుమతి లభించినట్లు చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై.సుజిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీఈ, సీఎస్ఈ విభాగాలలో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశోధనా కేంద్రాల ఏర్పాటుతో విద్యార్థుల్లో కొత్త విషయాల ఆవిష్కరణ, సాంకేతిక అభివృద్ధి, నైపుణ్యాల అభివృద్ధి విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని అన్నారు. ఈ సందర్భంగా తమ కళాశాలకు పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూకే కాకినాడ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ఇతర



జేఎన్‌టీయూకే వీసీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్న చలపతి యాజమాన్యం, అధ్యాపకులు

అధికారులకు కార్యదర్శి వై.సుజిత్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డీన్లు డాక్టర్ పి.బాల మురళీ కృష్ణ, డాక్టర్ వీవీ సుబ్బారావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరాట బావుటా ఎగరేద్దాం

భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం

నెహ్రూనగర్: 1985లో కారంచేడు దళితులపై అగ్రకుల భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక న్యాయశక్తిగా మారిందని, తద్వారా నూతన చట్టాలను సాధించి రాజ్యాంగ హక్కులు పొందగలిగామని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితో దళిత, బహుజనులు ఆత్మగౌరవ పోరాట బావుటా ఎగరేయాలన్నారు. కారంచేడు దళిత అమరవీరుల 40వ సంస్మరణ దినోత్సవాన్ని లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ఉద్యమాలు అంబేడ్కర్ భావజాల స్ఫూర్తితో రాజకీయ సాధికారతతో గ్రామ గ్రామాన కొనసాగించాలన్నారు. దళిత, బహుజన యువత విద్య ఉపాధి రంగాల్లో మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ మార్గాలను అనుసరించి రాజకీయ చైతన్యం పొందాలని నీలాంబరం పిలుపు



అంబేడ్కర్ విగ్రహం వద్ద కారంచేడు మృతులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నిచ్చారు. నేటికీ ఏదోక చోట దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, వీటన్నింటికి ఎదురొడ్డి పోరాడాలంటే దళితులంతా ఏకతాటిపై నిలబడి తమ హక్కుల సాధన కోసం నిలబడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. దళిత సంఘాల నాయకులు మద్దు ప్రేమజ్యోతిబాబు, బండ్లమూడి స్టాలిన్, చిన్నం డేవిడ్ విలియమ్స్, బత్తుల అనిల్, కనకవల్లి వినయ్, దార్ల చిన్న, తిప్పాబత్తిన గోవింద్, రావినూతల కమలకుమారి, లక్ష్మీనారాయణ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు

మేడికొండూరు: ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల సౌకర్యార్థం ఆర్వో వాటర్ ప్లాంట్, లైబ్రరీని సొంత ఖర్చులతో పూర్తిచేసి పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి కష్టపడి చదువుకోవాలన్నారు. ఎంచుకున్న రంగాల్లో రాణించాలని తెలిపారు. సిరిపురం స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ మాట్లాడుతూ.. పాఠశాల అవసరాల నిమిత్తం పాఠశాల అభివృద్ధికి ఆర్వో వాటర్ ప్లాంట్, లైబ్రరీని కోరిన వెంటనే అందజేసిన శ్రీవ్యాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలి



ప్రారంభోత్సవంలో స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ శ్రీవ్యాల్

పారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడియాల గణేష్ బాబు, మరిపూడి రాంబాబు, కడియాల హనుమంతరావు, వడ్డంపూడి భాను ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జలమయమైన రహదారులు



పొన్నూరు: ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు గురువారం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమవ్వడంతో చీకట్లు ఆవరించాయి. గాలులు వీచి.. పెద్ద ఎత్తున వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో నీరు పోయే మార్గాలు లేక వర్షం నీటిలోనే జనం రాకపోకలు సాగించారు.

చేబ్రోలు: రైతులు గురువారం కురిసిన వర్షంతో హర్షం వ్యక్తం చేశారు. చేబ్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో కొద్ది రోజులుగా రైతులు ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ సాగు పనులు ప్రారంభించారు. దుక్కులు దున్ని వెద పద్ధతిలో వరి విత్తనాలు నాటిన రైతులు వరుణిడి కరుణ కోసం నిరీక్షించారు. ప్రస్తుతం కురిసన వర్షం వెద పద్ధతిలో నాటిన విత్తనాలు మొలకెత్తడానికి ఉపయోగపడుతుందని అన్నదాతలు చెబుతున్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఇన్‌ఛార్జ్‌గా దినేష్

నెహ్రూనగర్: అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా జ్యోతి దినేష్‌ను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి తెలియజేశారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దినేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని చెప్పారు.

ఎయిమ్స్‌లో అత్యాధునిక ల్యాబ్ ప్రారంభం

మంగళగిరి: రాష్ట్రంలోనే అత్యాధునిక ఆర్ట్ ఎన్ఐసీయూ పీఐసీయూ ల్యాబ్‌ను ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్)లో అందుబాటులోకి రావడం అభినందనీయమని ఎయిమ్స్ డైరెక్టర్ అహెంతమ్ శాంత సింగ్ తెలిపారు. గురువారం ఎయిమ్స్‌లో ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నూతనంగా ప్రారంభించిన ల్యాబ్‌తో రోగులకు అతి తక్కువ ఖర్చుతో పరీక్షలు నిర్వహించి చికిత్స అందించనున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

తాడికొండ: తుళ్లూరు మండలంలో యువతి అదృశ్యంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఉద్దండరాయునిపాలెం గ్రామానికి చెందిన 35 ఏళ్ల యువతి ఈ నెల 15వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారిని అడిగినా ఫలితం లేకపోవడంతో గురువారం తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యువతి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైతు సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

పెదకాకాని: రైతులకు అందుబాటులో ఉంటూ వ్యవసాయశాఖ అధికారులు సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నంబూరు రైతు సేవా కేంద్రంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ గ్రామస్థాయి అధికారులు పాటించాల్సిన 28 రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్లో సబ్సిడీపై పంపిణీ చేసిన వరి విత్తనాలు, వాటి నాణ్యతా ప్రమాణాలు, పరీక్ష చేసిన విత్తనాల మొలక శాతం కోసం పెంచిన ట్రేలను పరీక్షించారు. నీటి సరఫరాపై ఇరిగేషన్‌శాఖ ఎస్ఈతో ఆయన మాట్లాడారు. నలుగురు విస్తరణ అధికారులకు గానూ ఇద్దరు మాత్రమే హాజరు కావ



వరి మొలకలను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

డాన్ని స్థానిక వ్యవసాయశాఖ అధికారి కె.రమణకు మార్‌ను వివరణ అడిగారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛతలో క్లాప్‌మిత్రాల కృషి

ప్రత్తిపాడు: గ్రామాల స్వచ్ఛతలో క్లాప్‌మిత్రాల పాత్ర అనిర్వచనీయమని డీఎల్‌పీవో కె.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని తుమ్మలపాలెం గ్రామ పంచాయతీలోని సుప్రీమ్ ఎల్‌టీసీ(ఎస్‌డబ్ల్యూపీసీ)లో గురువారం క్లాప్‌మిత్రాలకు యూనిఫాం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు క్లాప్ మిత్రాలకు యూనిఫాం, కిట్లను అందించారు. కార్యక్రమంలో క్లాప్



యూనిఫాం అందిస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాసరావు

మిత్రాలు, వాటర్ ఎయిడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గాలి

- స్టీలు బాక్సులు తీసుకెళితే చికెన్, మటన్ కిలోకి రూ.10 తగ్గింపు
- ఈమేరకు ఆయా వ్యాపారులు ఒప్పుకొన్నారు
- ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా, ఇంటి నుంచి స్టీల్ బాక్స్‌లు తెచ్చుకునే వారికి చికెన్, మటన్ స్టాల్స్‌లో కేజీకి రూ.10 తగ్గింపునకు ఆయా షాపుల యజమానులు ఒప్పుకున్నారని ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలోని హోటల్స్, చికెన్, మటన్ స్టాల్స్, కర్రి పాయింట్స్ నిర్వాహకులతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వినియోగం నిషేధంపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఇన్‌ఛార్జ్ కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వలన ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించేలా ప్రజలు చికెన్, మటన్ షాపులకు వెళ్లేవారు ఇంటి నుంచి స్టీల్ బాక్స్‌లు



సమావేశంలో మాట్లడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు

తెచ్చుకుంటే వారికి కిలోకి రూ.10 తగ్గించడానికి ఆయా స్టాల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. చికెన్, మటన్ షాపుల దగ్గర ఈ మేరకు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు తమ ఆరోగ్య రక్షణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడకుండా గుడ్డ లేదా జ్యూట్ సంచులను వినియోగించుకోవాలని కోరారు. డిప్యూటీ కమిషనర్, సీఎంఓహెచ్(ఇన్‌చార్జి) టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) సోమశేఖర్, ప్రజారోగ్య అధికారులు, చికెన్, మటన్ షాపులు, హోటల్స్, కర్రీ పాయింట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సింగారవేలు శెట్టియార్ చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: స్వాతంత్ర్యం రాకముందే మద్రాసులో మున్సిపల్ కార్మికుల సంఘం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కరించడం కోసం కృషి చేసిన సింగారవేలు శెట్టియార్ చిరస్మరణీయుడని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి అన్నారు. గుంటూరు కొత్తపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం కోటి వీరాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీనియర్ నాయకుడునూతలపాటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు రావుల అంజిబాబు మాట్లాడారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు.

జీఎంసీ మహిళ ఉద్యోగినుల మధ్య ఘర్షణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని నల్లచెరువు వాటర్ ట్యాంకుల్లో పనిచేసే ఇద్దరు అవుట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగినుల మధ్య బుధవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ఓ ఉద్యోగినికి గాయాలు కావడంతో జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ ఎమ్మెల్సీ కింద నమోదు చేసి చికిత్స చేశారు. వివరాల్లోకి వెళితే.. గత రెండు రోజులుగా నగరంలో తాగునీటి సరఫరా జరగకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని.. ట్యాంకర్ కావాల్సిన వారు జీఎంసీ కాల్‌సెంటర్‌కు కాల్ చేస్తే వెంటనే పంపుతారని అధికారులు ప్రకటించారు. దీంతో నల్లచెరువు పరిధిలో చాలా మంది వాటర్ ట్యాంకర్ల కోసం ఫోన్లు చేశారు. అయినప్పటికీ వాటర్ ట్యాంకులు రాకపోవడంతో నల్లచెరువు రిజర్వాయర్ వద్ద నిరసన వ్యక్తం చేసి, ట్యాంకర్ల కోసం అధికారులకు మళ్లీ ఫోన్లు చేశారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు ట్యాంకర్లు పంపించారు. ఈ ట్యాంకర్ల పంపిణీ విషయంలో నల్లచెరువు రిజర్వాయర్ వద్ద పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌లు ఘర్షణ పడ్డారు.